

పల్లకీలో మహానందీశుడి విహారం

మహానంది: గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామికి సోమవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.



మల్లన్నకు అడ్డనామాల ప్రతిమ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి గద్వాలకు చెందిన జూరాల అనికేత్‌సాయి సోమవారం 68 గ్రాముల బంగారు త్రిపుండ్రాల ప్రతిమను(అడ్డనామాల ప్రతిమను) సమర్పించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,629.42
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 91.905
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 4,055
అవుట్ ఫ్లో	: 5,175

న్యూస్‌రీల్

శ్రీమఠంలో నాగసాధువులు



శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులతో నాగసాధువులు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠాన్ని 8 మంది నాగసాధువులు సందర్శించారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులను కలుసుకుని కాసేపు ముచ్చటించారు. రామేశ్వరంలో జరుగు మహాకుంభ మేళానికి వెళ్తూ ఇటు వచ్చినట్లు అఘోరాలు తెలిపారు.

15 వరకు జిల్లాలో తేలికపాటి వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): అగ్నేయ బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఈ నెల 15 వరకు జిల్లాలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు ప్రకటించారు. మళ్లీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో ధాన్యం, మిర్చి, పొగాకు రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పంటల్లో కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ధాన్యం పొలాల్లోనే ఉండిపోయింది. మిర్చిలో మొదటి కోత కోసి పొలాల్లోనే ఆరబెట్టారు. వర్షాలు పడితే వరి, మిర్చి, పొగాకు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు. వర్షాలు తెరిపి ఇచ్చే వరకు వరికోతలు చేపట్టకపోవడం మంచిదని తెలిపారు.

హాస్టళ్లలో మరమ్మతులకు నిధుల విడుదల

కర్నూలు(అర్బన్): జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో వివిధ రకాలైన మరమ్మతు పనులు చేపట్టేందుకు రూ.7,89,99,000 విడుదలైనట్లు ఆ శాఖ సంయుక్త సంచాలకులు కె. తులసీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో బాల, బాలికలకు సంబంధించి మొత్తం 24 వసతి గృహాలు కొనసాగుతున్నాయన్నారు. వీటిలో తాగునీటి సరఫరా, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, తలుపులు, కిటికీలకు మెష్, పైకప్పులు, ఫ్లోరింగ్, కాంపౌండ్ వాల్స్, టాయ్‌లెట్ల తదితర వాటి మరమ్మతులకు ఆ నిధులు వినియోగించాల్సి ఉంటుందన్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పరిశీలన



క్యూకంపార్ట్‌మెంట్లను పరిశీలించి పలు సూచనలు చేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 19 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు పరిశీలించారు. సోమవారం ఆయన కైలాసద్వారం, హఠకేశ్వరం, క్యూ కాంప్లెక్స్ తదితర ప్రదేశాలను సందర్శించారు. అనంతరం ఈఓ మాట్లాడుతూ అటవీశాఖ సహకారంతో భీమునికొలను మెట్ల మార్గం, కైలాసద్వారం వద్ద జంగిల్ క్లియరెన్స్, కైలాసద్వారం నుంచి హఠకేశ్వరం వరకు ఉన్న జంగిల్ క్లియరెన్స్‌తో పాటు, రోడ్డుకు గ్రావెల్ పనులు చేయాలని సూచించారు. కై లాసద్వారం వద్ద చలువ పందిళ్లు, తాత్కాలిక షెడ్లు, మంచినీటి వసతి, తాత్కాలిక విద్యుద్దీకరణ పనులు ముందస్తుగా చేపట్టాలన్నారు. శ్రీశైల టీవీ ప్రసారాలు, అధ్యాత్మిక కార్యక్రమాలను భక్తులు తిలకించేందుకు వీలుగా క్యూకాంప్లెక్స్‌లో ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో దేవస్థాన ఇంజినీర్లు, శ్రీశైలం అటవీశాఖ రేంజ్ అధికారి సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

అబలపై అకృత్యకాండ!

- జిల్లాలో రెచ్చిపోతున్న మృగాళ్లు
- బాలికలు, మహిళలపై పెచ్చుమీరిన అఘాయిత్యాలు
- ముచ్చుమర్రి ఘటన మరువకముందే నందికొట్కూరులో దారుణం
- ఇంట్లో ఉన్న అమ్మాయిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ప్రేమోన్మాది
- కూటమి ప్రభుత్వంలో పెచ్చుమీరిన దుర్మార్గాలు
- జిల్లాలో 10కి పైగా పోక్సో కేసుల నమోదు
- చేష్టలుడిగి చూస్తున్న పోలీసులు
- మాటలకే పరిమితమైన హోంమంత్రి



సాక్షి, నంద్యాల: అత్యాచారాలు...వేధింపులు..స్కూల్లో...వీధిలో..రోడ్డుపై అక్కడా ఇక్కడా కాదు..ఎక్కడైనా ఒక్కటే మగాళ్లు మానవ మృగాల్లా మారిపోతున్నారు. అభంశుభం తెలియని వారిపై దాష్టీకాలకు పాల్పడూ దమనకాండ సాగిస్తున్నారు. చివరకు ఇంట్లో ఉన్న అమ్మాయిలపైనా పెట్రోలుతో దాడులు జరుగుతుంటే బిడ్డలను గుప్పింట్లో పెట్టుకుని చూసుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. ముఖ్యంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో అమ్మాయిలకు రక్షణ కరువైంది. ఎవరు ఎటువైపు నుంచి వచ్చి దాడి చేస్తారో తెలియక బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుస్థితి నెలకొంది. చిన్నారులు, మహిళలపై మృగాళ్లు రెచ్చిపోతున్నా పోలీసులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఒకదాని తర్వాత రోజుకో అఘాయిత్యం నిత్యకృత్యంగా మారాయి. నేరాలకు పాల్పడిన నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవడంలో పోలీసులు ఘోరంగా విఫలమవుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ఘటన

జులై 7న పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల బాలిక ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన ముగ్గురు బాలురు అమ్మాయిపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆపై చిన్నారిని చంపేశారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. కానీ, ఇప్పటి వరకు చిన్నారి మృతదేహాన్ని పోలీసులు కనుగొనలేకపోయారు. హోంమంత్రి అనిత కనీసం పరామర్శకు రాలేదు.

నిర్భయంగా బయట తిరుగుతున్న నేరస్తులు

ముచ్చుమర్రి మైనర్ బాలిక హత్యాచారం ఘటనలో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఘటన జరిగిన 90 రోజుల్లోనే ఐదుగురికి బెయిల్ మంజూరైంది. ప్రభుత్వ తరపు నుంచి సరైన వాదనలు, ఆధారాలు చూపించకపోవడంతో కేసు కూడా నీరుగారుపోయినట్లు సమాచారం. బాలిక మృతదేహం గాలింపు చర్యలను కూడా పోలీసులు ఆపేశారు. మృతికి సంబంధించి ఏ చిన్న ఆధారాన్ని పోలీసులు చూపించలేకపోవడంతో నిందితులకు శిక్ష పడే అవ కాశాలు దాదాపు లేవని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

సోషల్ మీడియాపై శ్రద్ధ చిన్నారులపై ఎక్కడ?

కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరునెలల్లో జిల్లాలో పది రోజులకు ఒక పోక్సో కేసు నమోదైంది. వరుసగా చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడున్నా అరికట్టడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారు. కేసు నమోదైన తర్వాత నిందితులను పట్టుకుని శిక్ష పడడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కేసులు నమోదైన తర్వాత పంచాయితీలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో నేరస్తులు తాము నేరం చేసినా డబ్బులు ఇచ్చి మేనేజ్ చేసుకుని బయట నిర్భయంగా తిరగొచ్చనే ధైర్యంతో ఉన్నారు.

ఆడబిడ్డల జోలికొస్తే తాట తీస్తా.. ఈ విషయంలో రాజకీయం పనికిరాదు. ఎవరైనా సరే కఠినంగా శిక్షిస్తాం. చిన్న పిల్లలపై అత్యాచారాలు చేస్తున్నారంటే వీళ్లు మనుషులేనా? ఇద్దరు, ముగ్గురిని నడిరోడ్డుపై ఉరితీస్తేనే అలాంటివాళ్లు దారికొస్తారు. ఆడపిల్ల అంటే విలాస వస్తువు కాదు. ఎవరైనా ఆడపిల్లల జోలికి వస్తే అదే చివరిరోజు అవుతుంది. చట్టాలను సైతం కఠినతరం చేశాం.. వెంటనే శిక్షలు పడేలా చేస్తాం.

– ఇటీవల సీఎం చంద్రబాబు చెప్పిన మాటలివి

ఆడపిల్లలపై దాడులు కాదు కదా... తప్పుగా చూసినా కఠినంగా చర్యలు తీసుకుంటాం. ముచ్చుమర్రిలో జరిగిన ఘటన మరోసారి పునరావృతం కానివ్వం. బాలికలు, మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తాం. ఏ ఒక్కరికీ ఇబ్బంది కలగనివ్వం.

– హోంమంత్రి అనిత చేసిన ఆర్భాటపు ప్రకటన ఇది

మహిళలు, బాలికలపై దాడులు, దౌర్జన్యాలు, అఘాయిత్యాలు..అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి. ఒక్క నంద్యాల జిల్లాలోనే ఏకంగా 10 పోక్సో కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. తాజాగా నందికొట్కూరులో లహరిపై ప్రేమోన్మాది ఏకంగా పెట్రోలు పోసి తగలబెట్టిన ఘటన రాష్ట్రంలోనే సంచలనం కాగా.. అదుపు తప్పిన శాంతిభద్రతలను లహరి ఆత్మ ప్రశ్నిస్తోంది.

నిద్రిస్తున్న అమ్మాయిపై పెట్రోల్‌తో దాడి

నందికొట్కూరు పట్టణంలోని బైరెడ్డి నగర్‌కు చెందిన ఇంటర్ మీడియట్ సెకండ్ ఇయర్ చదువుతున్న లహరి అనే విద్యార్థినిపై వెల్దుర్తి మండలం కలుగొట్ల చెందిన రాఘవేంద్ర అనే యువకుడు సోమవారం తెల్లవారు జామున పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు బాలిక అమ్మమ్మ పార్వతమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ముచ్చుమర్రిలో జరిగిన దారుణ ఘటన మరువకముందే ఈ ఘటన చోటుచేసుకోవడంతో జిల్లా ఉలిక్కిపడింది.



లహరి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

- ➤ **సెప్టెంబర్ 1:** వెలుగోడు మండల పరిధిలోని బోయరేవుల గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలిక ఇంటి వద్ద ఆడుకుంటూ ఉండగా... ఇంటి పక్కనే ఉన్న బాలుడు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు.
- ➤ **సెప్టెంబర్ 1:** అవుకు మండలం కాశీపురం గ్రామానికి చెందిన ఎనిమిదో తరగతి బాలికపై అదే గ్రామానికి చెందిన ప్రభుదాస్ అత్యాచారానికి పాల్పడడంతో పోక్సో కేసు నమోదైంది
- ➤ **సెప్టెంబర్ 19:** బేతంచెర్ల సిమెంట్ నగర్‌కు చెందిన బాలికను బండి ఆత్మకూరు మండలం పార్నపల్లెకు చెందిన యువకుడు ప్రేమ పేరుతో అత్యాచారానికి పాల్పడ్డాడు.
- ➤ **సెప్టెంబర్ 25:** మిడుతూరు మండలం నాగలూటి గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన వడ్డే ఎల్లారాజు అత్యాచారానికి పాల్పడ్డాడు.
- ➤ **అక్టోబర్ 9:** డోన్ మండలం యు.కొత్తపల్లె గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి సుధీర్ కుమార్ అదే గ్రామానికి చెందిన బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారం చేసినట్లు బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదైంది.
- ➤ జిల్లా కేంద్రమైన నంద్యాలలోనే నాలుగు పోక్సో కేసులు నమోదయ్యాయి

మహిళలకు రక్షణ కరువైంది



రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైంది. ఏపీని అత్యాచారాంధ్రప్రదేశ్‌గా కూటమి ప్రభుత్వం మార్చింది. ముచ్చుమర్రి సంఘటన మరువకముందే పట్టణంలో బాలిక లహరి ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురికావడం దారుణం. మహిళలు, విద్యార్థినులపై వరుసగా దాడులు, అత్యాచారాలు జరుగుతుంటే ప్రభుత్వ పెద్దలు వాటి కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. గత ప్రభుత్వం మహిళలు, బాలికల రక్షణ కోసం దిశ పోలీసు స్టేషన్లు, దిశ యాప్‌ను తీసుకొచ్చింది. కూటమి సర్కారు వాటిని నిర్వీర్యం చేసింది. మహిళల రక్షణ గాలికొదిలేసింది. ఏదిఏమైనా బాలిక కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి.

– ధార సుధీర్, వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు ఇన్‌చార్జ్



రోదిస్తున్న బాలిక తల్లి లక్ష్మి

మన్నించుతల్లీ..

చదువులో అలలా ఎగసినా
జీవితంలో ఓడిపోయావా తల్లీ
తల్లి చాటు బిడ్డవనీ దయతలచలేకపోయాం
ప్రేమ పేరుతో నీ ఆశలను కాల్చేశాం
నీ ఆశయాన్నీ బుగ్గిచేశాం
ఆ మృగమేదో నిను దహిస్తుంటే ఆపలేకపోయాం
నీ ఇంట్లోనే నీకు రక్షణ కల్పించలేకపోయాం
మమ్మల్ని క్షమించు తల్లీ...
నిన్ను కాపాడలేని పాలకులను మన్నించు
నువ్వేదున్నా ఇటువైపు చూడకు తల్లీ
బూడిదైన నీ శరీరానికి ఇక ఎన్ని రంగులు పులుముతారో
పెట్రోలులో మండిన నీ హృదయాన్ని
ఎంత గాయపరుస్తారో
తప్పంతా నీదేనని దుర్మార్గులూ...
నీ ప్రాణాలకు వెలకట్టే 'అనిత'ర సాధ్యులున్నారమ్మా
అందుకే ఇటువైపు రాకు తల్లీ
ఏ లోకంలో ఉన్నా హాయిగా ఉండు..
మరు జన్మలోనైనా మానవమృగాల్లేని
లోకంలో జన్మించు

ఉజ్వల భవిష్యత్తు ఉన్న బాలికను నందికొట్కూరులో ఓ ప్రేమోన్మాది పెట్రోలు పోసి నిప్పంటించి ప్రాణాలు బలిగొన్నాడు.

ప్రధాన వార్త 10లో ▶

ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలి

ప్రేమోన్మాదిని బహిరంగంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు సోమవారం పట్టణంలోని పటేల్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బాలికలు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు. విద్యార్థినిపై పెట్రోల్‌పోసి నిప్పంటించిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని, అప్పుడే ఇలాంటి సంఘటనలు పునరావృతం కావన్నారు. బాధిత కుటుంబానికి రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ నాయకులు రఘురామ్మూర్తి, రమేష్‌బాబు, శ్రీనివాసులు, మహనంది, దినేష్ జిల్లా ఎస్పీని కలిసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు.

పింఛన్ ఉంటుందో..ఊడుతుందో!

- ప్రభుత్వం తనిఖీలతో సామాజిక పింఛన్‌దారుల్లో ఆందోళన
- ఎరుకల చెర్వులో 328, కానాలలో 416 పింఛన్ల తనిఖీ
- ఎవరెవరి పింఛన్లు తీసివేయాలనే దానిపై అధికారులకు టీడీపీ నేతల దిశానిర్దేశం చేసినట్లు ప్రచారం



ఎరుకల చెర్వులో పింఛన్లను వెరిఫై చేస్తున్న ప్రత్యేక టీమ్ అధికారులు

నంద్యాల మండలం కానాల పంచాయతీ పరిధిలోని హైస్కూల్ కొట్టాల గ్రామంలో నారాయణ రెడ్డి అనే పింఛన్‌దారుడికి 70 ఏళ్లు ఉన్నాయి. ఈయన పదేళ్లుగా పింఛన్ తీసుకుంటున్నాడు. సోమవారం సామాజిక పింఛన్ల తనిఖీ అధికారులు ఇంటి వద్దకెళ్లి బ్రాహ్మణపల్లె గ్రామంలో మీకు ఆరు ఎకరాల పొలం ఉందంటూ డాక్యుమెంట్లు చూపించారు. సెంటు పొలం కూడా లేదని చెప్పబోతుండగా పొలం లేనట్లుగా వన్‌బీ తీసుకొని వస్తేనే పింఛన్ ఉంటుందని అధికారులు చెప్పడంతో దిక్కులు చూడాల్సి వచ్చింది. ఈ పరిస్థితి నారాయణరెడ్డి ఒక్కడే కాదు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు పింఛన్‌దారులు ఎదుర్కొంటున్నారు. వివిధ కారణాలను బూచిగా చూపి పింఛన్ల ఏరివేతకు కూటమి ప్రభుత్వం తనిఖీలు చేపట్టింది.

కర్నూలు(అగ్రికల్చర్): సామాజిక పింఛన్ల ఏరివేతకు కూటమి ప్రభుత్వం తనిఖీలు చేపట్టడంతో లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. పైలెట్ ప్రాజెక్టు కింద సోమవారం ఎంపిక చేసిన గ్రామాల్లో పింఛన్ల తనిఖీ చేపట్టారు. కర్నూలు జిల్లా పరిధిలో కృష్ణగిరి మండలం ఎరుకలచెర్వు గ్రామంలో 10 టీమ్‌లు, నంద్యాల జిల్లా పరిధిలో నంద్యాల మండలం కానాల గ్రామంలో 10 టీమ్‌లు తనిఖీలు చేపట్టాయి. ఈ ప్రక్రియను కర్నూలు డీఆర్‌డీఏ పీడీ నాగశివలీల, నంద్యాల పీడీ శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షించారు. ఆయా గ్రామాల్లోకి ఒకేసారి పెద్ద సంఖ్యలో తనిఖీ టీంలు రావడంతో పింఛన్‌దారుల్లో తమ పింఛన్ ఉంటుందో.. ఉండదోనన్న భయం కనిపించింది. నమ్మి గెలిపిస్తే చంద్రబాబు మా పింఛన్లకు ఎసరు పెట్టారనే ఆవేదన వ్యక్తమైంది. తనిఖీల బృందాలకు నేతృత్వం వహించే అధికారులను టీడీపీ నేతలు ఫోన్ల ద్వారా సంప్రదించి ఎవరెవరి పింఛన్లను తొలగించాలనే దానిపై దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. అందుకు అనుగుణంగానే తనిఖీలు చేపట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పింఛన్ కొనసాగించడానికి సిఫారస్సు చేస్తున్నారా.. లేదా అనే దానిని టీమ్ అధికారులు యాప్‌లో నమోదు చేశారు. ఎరుకలచెర్వులో 349 పింఛన్లు ఉండగా.. 328 పింఛన్‌లను తనిఖీ చేశారు. 21 మంది అందుబాటులో లేరు. కానాల సచివాలయం–2లో 420 పింఛన్లు ఉండగా.. 416 పింఛన్‌లను తనిఖీ చేశారు. నలుగురు అందుబాటులో లేరు.

రబీ..అగమ్యగోచరం!

- ఉమ్మడి జిల్లాలో 6.95 లక్షల ఆయకట్టుకు కృష్ణా, తుంగభద్ర జలాలే ఆధారం
- తెలంగాణ సర్కారు ఇష్టారాజ్యంగా ఎడమ గట్టులో విద్యుత్ ఉత్పత్తి
- చోద్యం చూస్తున్న కూటమి ప్రభుత్వం
- సాగునీటి విడుదలపై కొరవడిన స్పష్టత
- నేడు సాగునీటి సలహా మండలి సమావేశం

రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలవుతున్నా తాగు, సాగు నీటి గురించి పట్టించుకోవడంలేదు. ఎలాగోలా ఖరీఫ్ సీజన్ గడిచిపోయినా రబీ సీజన్‌లో జిల్లా రైతాంగం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. శ్రీశైలం జలాశయంలో నిల్వ ఉన్న నీటిని తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ ఉత్పాదన పేరుతో యథేచ్ఛగా వాడేస్తున్నా, టీబీ డ్యాంలోని మన నీటి వాటాను పొరుగు జిల్లా నాయకులు హెచ్చెల్సీ ద్వారా మళ్లించుకునేందుకు సిద్ధమవుతున్నా ఇక్కడి పాలకులు నోరుమెదపని పరిస్థితి. రబీకి నీటి విడుదలపై నేడు నంద్యాల కలెక్టరేట్‌లో సాగునీటి సలహామండలి సమావేశం నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.



కేసీ కెనాల్ కింద పంట సాగు చేసిన దృశ్యం

కర్నూలు సిటీ: రాయలసీమ జిల్లాలకు కృష్ణా, తుంగభద్ర నదులే ప్రధాన జల వనరులు. ఈ నీటిపై ఆధారపడి ఉమ్మడి కర్నూలు, ఉమ్మడి కడప జిల్లాల్లోనే 6 లక్షలకుపైగా ఆయకట్టు ఆధార పడి ఉంది. శ్రీశైలం రిజర్వాయర్‌లో ప్రస్తుతమున్న నీటిని తెలంగాణ ప్రభుత్వం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి విచ్చల విడిగా వాడుకుంటోంది. ఫలితంగా ఈ ప్రభావం సీమ జిల్లాల సాగుపై పడింది. ఇప్పటికే ఇంజినీర్లు రబీలో ఆరుతడి పంటలకు మాత్రమే వారబందీగా నీరు ఇస్తామని ప్రకటించడతో రైతన్నలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈక్రమంలో నేడు జరిగే సాగు నీటి సలహా మండలి సమావేశంలో శ్రీశైలం నుంచి పవర్ జనరేషన్‌పై జిల్లా నేతలు గళం విప్పాల్సిన అవసరం ఉంది. దీంతో పాటు శ్రీశైలం కనీస నీటి మట్టం 854 అడుగులు ఉండేటట్లు ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని ఆయకట్టుదారులు కోరుకుంటున్నారు.

నీరున్నా ఆరుతడి పంటలకే

తెలుగుగంగ కాలువ పరిధిలో నంద్యాల జిల్లాలో 1.14 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ మొత్తానికి నీరు ఇచ్చేందుకు వెలుగోడు రిజర్వాయర్‌లో 15.787 టీఎంసీల నీరు ఉంది. అయితే, రబీలో వరి సాగు చేస్తే నీరు ఇవ్వలేమని, కేవలం ఆరుతడి పంటలకు, అది కూడా వారబందీగా ఇచ్చేందుకు సాధ్యమవుతుందని ఇంజినీర్లు చెబుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తెలుగుగంగ కాలువ ఆధునికీకరణ పనులు చేసి ఈ కాల్వ చరిత్రలో మొదటిసారి రబీ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరు ఇచ్చింది.

ఎస్ఆర్‌బీసీ పరిధిలో ప్రశ్నార్థకం

12.4 టీఎంసీల సామర్థ్యం ఉన్న గోరుకల్లు రిజర్వాయర్‌ను 2014లో చంద్రబాబు 3.36 టీఎంసీలు నిల్వ చేసి హడావుడిగా ప్రారంభించారు. ఫలితంగా రబీలో ఈ రిజర్వాయర్ ద్వారా ఒక్క ఎకరాకు సాగునీరు అందించలేకపోయారు. 2019లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏకంగా 11.2 టీఎంసీలు గోరుకల్లులో నిల్వ ఉంచి ఎస్ఆర్‌బీసీ పరిధిలో 2021–22లో 94 వేల ఎకరాలు, 2022–23లో 1.13 లక్షల ఎకరాల ఆయకట్టుకు సమృద్ధిగా నీరు అందించారు.

హంద్రీనీవాకు క'న్నీటి' కష్టాలే...!

హంద్రీనీవా కాలువ వెంబడి రైతులు పంటలు సాగు చేశారు. కాల్వలో 1688 క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రవహిస్తుంది. ఈ కాలువ కింద 40 వేల ఎకరాలకుపైగా సాగు చేశారు. కృష్ణగిరి, పందికోన రిజర్వాయర్లలో సైతం పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేయలేదు. ఇలాంటి సమయంలో శ్రీశైలం రిజర్వాయర్‌లో తగ్గిపోతున్న నీటి మట్టంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. దీంతో పాటు 79 చెరువులకు నీరు ఇచ్చేందుకు అవకాశం ఉన్నప్పటికీ ఇంత వరకు 30 చెరువులకు మాత్రమే నీటిని నింపారు. అన్ని చెరువులకు నీరు నింపి ఉంటే 10 వేల ఎకరాల ఆయకట్టు సాగు అయ్యేది.

కేసీ పరిధిలో ఆయకట్టుకు నీరు లేనట్టే!

కర్నూలు–కడప కాలువ పరిధిలో కర్నూలు, వైఎస్సార్ జిల్లాల్లో 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ కాల్వకు 39.9 టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నాయి. ఇందులో టీబీ డ్యాంలోని నిల్వ నీటి నుంచి 10 టీఎంసీలు, నది ప్రవాహం నుంచి 29.9 టీఎంసీల నీటిని వినియోగించుకోవచ్చు. తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం తగ్గిపోవడంతో శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నీటిని వినియోగించేందుకు మల్యాల దగ్గర రెండు పంపులు, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం చేపట్టారు. అయితే, శ్రీశైలం రిజర్వాయర్ నీటి నిల్వలో రోజు 3 టీఎంసీలకుపైగా పవర్ జనరేషన్ పేరుతో దిగువకు పోతుంది. మరోవైపు టీబీ డ్యాంలోకి ఈ ఏడాది వచ్చిన నీటి ఆధారంగా 9.08 టీఎంసీ నీరు కేటాయించారు. ఇందులో మనం చుక్క నీరు కూడా వాడుకోలేదు. అయితే, ఈ నీటిని తాగునీటి అవసరాల పేరుతో అనంతపురం జిల్లా పాలకులు హెచ్చెల్సీ ద్వారా మళ్లించుకునేందుకు సిద్ధమవుతుండడంతో ఇక్కడి రబీ ఆయకట్టుకు నీరు ఇవ్వలేమని జల వనరుల శాఖ ఇంజినీర్లు సంకేతాలు ఇస్తున్నారు.

నీటి లభ్యత ఆధారంగా నీరిస్తాం

పవర్ జనరేషన్ నిలిపి వేయాలని తెలంగాణ జెన్‌కోకు ఎన్ని సార్లు లేఖలు రాసినా, కేఆర్ఎంబీ వారు సైతం హెచ్చరించినా విద్యుత్ ఉత్పాదన నిలిపి వేయడం లేదు. వెలుగుగోడు, గోరుకల్లు రిజర్వాయర్లలో ఉండే నీటి ఆధారంగా ఆరుతడి పంటలకు నీరు ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. కేసీ కెనాల్ పరిధిలో రెండో పంటకు నీరు ఇచ్చేందుకు సాధ్యం కాదు.

– కబీర్ బాషా, జల వనరుల శాఖ కర్నూలు ప్రాజెక్ట్స్ సీఈ

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

- లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలి
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు లాగిన్‌లో పరిశీలన చేసి తగు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. కొన్ని శాఖల అధికారులు వచ్చిన అర్జీలను చూడడంలేదని, ఈ అంశంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సిబెళగల్, వెల్దుర్తి, మద్దికెర, గూడూరు, ఎమ్మిగనూరు, కర్నూలు ఆర్‌డీఓలు ఐదు రోజుల వరకు, జిల్లా మైనార్టీ శాఖ అధికారి 7 రోజులైనా అర్జీలను చూడకపోవడంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదోని ఎంఈఓ తన లాగిన్‌కు వచ్చిన అర్జీలను 14 రోజులైనా చూడకపోవడంతో అతనిపై చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్‌ను ఆదేశించారు. రీ ఓపెన్ కేసులకు సంబంధించి పత్తికొండ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే 6 కేసులు, సీఎంఓకు సంబంధించి 10 అర్జీలు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు చిరంజీవి, కొండయ్య పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

- ➡ అవసరం లేకున్నా సిజేరియన్ కాన్పులు చేస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని, ఆరోగ్యశ్రీ నిధుల కోసం కొన్ని ఆసుపత్రులు మహిళల ప్రాణాలతో చెలగాటమడుతున్నాయని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నగర కార్యదర్శి తిరుపాల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- ➡ ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తున్న భాష్యం పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్ కోరారు.

క్లుప్తంగా

కిక్ బాక్సింగ్‌లో కర్నూలుకు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న వైద్యులు త్రినాథ్

కర్నూలు (టౌన్): ఈనెల 7న విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో కర్నూలు క్రీడాకారులు పతకాలు సాధించారు. తలారి గణేష్ (మ్యూజికల్ పామ్ ఈవెంట్‌లో బంగారు పతకం), ఉప్పరి ఉపేంద్ర (పాయింట్ ఫైట్ ఈవెంట్‌లో బంగారు పతకం) జి. హరి కళ్యాణ్ (ఫుల్ కాంటాక్ట్ ఈవెంట్‌లో బంగారు పతకం), జయ కళ్యాణ్ (పాయింట్ ఫైట్‌లో బంగారు పతకం) పతకాలు సాధించినట్లు కిక్ బాక్సింగ్ కోచ్ నరేంద్ర సోమవారం తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను అర్కా హాస్పిటల్ వైద్యులు త్రినాథ్ అభినందించారు.

ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జాతీయ సభ్యురాలిగా శ్రావణి



కర్నూలు(సెంట్రల్): నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉమెన్ జాతీయ సమితి సభ్యురాలిగా జిల్లాకు చెందిన శ్రావణి ఎంపికైంది. ప్రస్తుతం ఆమె ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శిగా ఉన్నారు. ఆమె జాతీయ సభ్యురాలిగా ఎంపిక కావడంపై ఏపీ మహిళా సమాఖ్య నాయకురాళ్లు భారతి, రేణుక సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



విజయ్‌కుమార్ (ఫైల్)

ఆదోని అర్బన్: ఆలూరు మంలం కమ్మరచేడు గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి బైకు అదుపు తప్పిన ప్రమాదంలో పట్టణంలోని గణేష్ సర్కిల్‌లో నివాసముంటున్న విజయ్ కుమార్(28) మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. విజయ్‌కుమార్, అతని భార్య శిరీష, కుమార్తె అయోధ్యతో కలిసి చిప్పగిరి మండలం బెల్డోణ గ్రామానికి వెళ్లారు. ఆదివారం రాత్రి తిరిగి ఆదోనికి బయలుదేరారు. కమ్మరచేడు సమీపంలో బైకు అదుపుతప్పి కింద పడ్డారు. ప్రమాదంలో విజయ్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య, కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయి. ఆలూరు పోలీసులు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు బంధువులు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో చోరీ

ఆత్మకూరు: స్వరాజ్‌నగర్‌లో నివాసముంటున్న ప్రభుత్వ ఉద్యోగి ఆదిలక్ష్మి ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఇన్‌చార్జి సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ఆదిలక్ష్మి ఇంటికి తాళం వేసి బెంగళూరుకు వెళ్లింది. ఇదే అదనుగా భావించిన దుండగులు ఇంట్లోకి ప్రవేశించి పక్కనే ఉన్న బీరువా తాళంతో డోర్ ఓపెన్ చేసుకుని రూ.1.70 లక్షల నగదు, మూడు తులాల బంగారు, పది తులాల వెండి ఆభరణాలను మూటగట్టుకుని ఉడాయించాడు. అల్మారాలో స్కూటీ తాళం ఉండడంతో బయట పార్కింగ్ చేసిన స్కూటీని కూడా తీసుకుని పరారయ్యాడు. సోమవారం ఇంటికి చేరుకున్న ఆదిలక్ష్మికి బీరువా తెరిచి ఉండడం.. బయట స్కూటీ లేకపోవడంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌చార్జి సీఐ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం ద్వారా వేలిముద్రలు, ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పీడీఎఫ్ బియ్యం స్వాధీనం

- ఐదుగురిపై కేసు నమోదు
- ముగ్గురి అరెస్ట్



బియ్యం తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పట్టుకున్న పోలీసులు

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని గార్లదిన్నె క్రాస్ రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం అక్రమంగా తరలిస్తున్న పీడీఎఫ్ బియ్యాన్ని రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన ఎరుకుల ఈరన్న, ఎరుకుల తిమ్మప్పలు గ్రామాల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన రేషన్ బియ్యాన్ని కార్డుదారుల నుంచి కొనుగోలు చేసే వారు. సేకరించిన బియ్యాన్ని పార్లపల్లి గ్రామంలోని కుమ్మరి నరసింహులు ఇంటి వద్ద ముందుగా ఏర్పాటు చేసుకున్న మిషన్‌లో నూకలుగా మార్చే వారు. మార్చిన నూకలను శ్రీ విజయకృష్ణ డైరీ ఫ్రూటీస్ పార్లపల్లి గ్రామం పేరుతో బిల్లు తయారు చేసి వివిధ ప్రాంతాలకు తరలించి ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేవారు. ఎరుకుల ఈరన్న, ఎరుకుల తిమ్మప్పలకు చెందిన నూకలను ఏపీ21 టీసీ 0047 బొలెరో వాహనంలో ఏనుగులబాకు చెందిన రెడ్డి ఉదయ్‌కిరణ్‌రెడ్డి, రెడ్డి పెద్దరెడ్డి, పార్లపల్లికి చెందిన కుమ్మరి నరసింహులు 80 సంచుల్లో 40 క్వింటాళ్ల పీడీఎఫ్ నూకలను తరలిస్తున్నట్లు పక్కా సమాచారంతో దాడి చేసి పట్టుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. ముగ్గురు నిందితులతోపాటు బియ్యం, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎరుకుల ఈరన్న, ఎరుకుల తిమ్మప్ప బియ్యం సేకరించేందుకు సహకరించినట్లు విచారణలో తేలడంతో వారిపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తర్వలో వారిని అరెస్ట్ చేస్తామన్నారు.

హొళగుందలో ..

హొళగుంద: మండల కేంద్రం హొళగుందలో ప్రభుత్వం పంపిణీ చేసిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచుకున్న అల్లాబకాష్ అనే వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ బాల నరసింహులు సోమవారం తెలిపారు. సదరు వ్యక్తి ఇంటి వద్ద తనిఖీలు చేపట్టగా 5 బస్తాల (250 కిలోలు) బియ్యం గుర్తించి తదుపరి చర్యలు నిమిత్తం వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర ప్రభుత్వం



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్

నందికొట్కూరు: ప్రజా సంక్షేమాన్ని కేంద్రం పూర్తిగా విస్మరించిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ ధ్వజమెత్తారు. సోమవారం ఆర్టీసీ బస్టాండ్ నుంచి జైకిసాన్ పార్కు వరకు సీపీఎం నంద్యాల జిల్లా రెండో మహాసభ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధనలక్ష్మితో పాటు గఫూర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడం లేదన్నారు. రుణమాఫీ చేయాలని ఢిల్లీకి బయల్దేరిన రైతులపై కాల్పులు జరిపిన ఘనత బీజేపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్మికుల సమస్యలను గాలికొదిలేసిన కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలన్నారు. విజయ్ మాల్యా, నీరజ్ మోదీ లాంటి వారిని కాపాడేందుకే నరేంద్రమోదీ ఉన్నారని ఆరోపించారు. దేశాభివృద్ధిని పక్కనపెట్టి ఓట్ల కోసం హిందూ, ముస్లింల మధ్య గొడవలు సృష్టించడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని విమర్శించారు. మోదీకి వత్తాసు పలుకుతూ రాష్ట్రంలో ఎమ్మెల్యేలు దోచుకుంటుంటే సీఎం చంద్రబాబు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధనలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, నాగరాజు, ఏసురత్నం, సలాంఖాన్, స్వాములు, రణధీర్, రత్నమయ్య, గౌస్, నరసింహులు, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, రాజశేఖర్, ఫక్కీర్‌సాహెబ్, గోపాలకృష్ణ, ఆంజనేయులు, రంగమ్మ, కర్ణ పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ సంస్థపై కేసు నమోదు

బొమ్మలసత్రం: సాఫ్ట్ వేర్ ఉద్యోగాలిప్పిస్తామని నమ్మించి నిరుద్యోగుల నుంచి రూ.98 లక్షల మేర వసూలు చేసి బోర్డు తిప్పేసిన ఎస్ఎల్‌సీ సొల్యూషన్స్ సంస్థపై టూటౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ ఇస్మాయిల్ తెలిపిన వివరాలు.. స్థానిక టీటీడీ కల్యాణ మండపం సమీపంలో ఉప్పరి వెంకట్ హైదరాబాద్‌లోని గిజిలీజ్ సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈవో రవిచంద్రారెడ్డి మరి కొంత మందితో కలిసి ఎస్ఎల్‌సీ సొల్యూషన్స్ పేరుతో సాఫ్ట్‌వేర్ సంస్థను నెలకొల్పారు. వివిధ రాష్ట్రాల్లో సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలిప్పిస్తామని దాదాపు 78 మంది నిరుద్యోగుల నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.1.20 లక్షల నగదు వసూలు చేశారు. దాదాపు రూ.98 లక్షలు వసూలు చేసి కంపెనీ బోర్డు తిప్పేసి నిర్వాహకులు పరారయ్యారు. విషయం తెలుసుకున్న బాధితుడు మద్దిలేటి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

ఆకతాయికి జైలు శిక్ష

బండిఆత్మకూరు: మండలంలోని కడమల కాలువ గ్రామానికి చెందిన పెద్దస్వామికి నంద్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్ రెడ్డి 5 రోజులు జైలు శిక్ష విధించారని ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. పెద్దస్వామి మద్యం తాగి చుట్టుక్కల వారిని సభ్యత లేకుండా తిడుతున్నాడని గ్రామస్తుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అరెస్ట్ చేశారు. కేసు నమోదుచేసి నంద్యాల సెకండ్ క్లాస్ కోర్టులో హాజరు పరచగా 5 రోజులు జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారని ఎస్ఐ తెలిపారు.

సర్పంచ్‌లను అవమానించడం తగదు



మాట్లాడుతున్న సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు మహేశ్వరరెడ్డి

కొలిమిగుండ్ల: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్‌లపై అవమానకరంగా మాట్లాడటం తగదని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం కొలిమిగుండ్లలో ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి సర్పంచ్‌లపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 14వ ఆర్థిక సంఘం నిధులను సర్పంచ్‌లు దొంగల్లాగా పంచుకున్నారని ఆరోపించడం తగదన్నారు. నిధులు లేని సమయంలో గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య, వీధిలైట్లు తదితర సమస్యల పరిష్కారానికి స్వంత డబ్బులతో పాటు అప్పులు చేశామన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఎమ్మెల్యే మాట్లాడం సరికాదన్నారు. క్షమాపణ చెప్పాలని డిమాండ్

నీటి గుంతలో పడి కాడెద్దులు మృతి



మృతి చెందిన ఎద్దులు

పాణ్యం: నీటి గుంతలో పడి కాడెద్దులు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని అహల్యాపురం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. రైతు పాలుగారి ప్రసాద్, రూతమ్మ దంపతులు పొలంలోని పైరుకు పిచికారీ చేసేందుకుని ఉదయం ఎడ్ల బండిపై రెండు ప్లాస్టిక్ డ్రమ్ములు పెట్టుకుని పొలానికి బయలుదేరారు. భూపనపాడు రస్తాలోని మద్దూరు పొలిమేరలో రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం తీసిన గుంత వద్ద బండిని నిలిపి డ్రమ్ములకు నీరు నింపుకుంటూ ఉండగా ఎద్దులు బెదిరి వెనక్కి రావడంతో ఎద్దులు, బండి, డ్రమ్ములతోపాటు రూతమ్మ గుంతలో పడిపోయింది. ప్రసాదు అతికష్టంగా తన భార్యను బయటకు తీసి ప్రాణాలు కాపాడాడు. గుంత దాదాపు 50 అడుగుల లోతు ఉండటంతో ఎద్దులు, బండి మునిగిపోయింది. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి చేరుకుని ట్రాక్టర్ల సాయంతో ఎద్దులను బయటకు తీయగా అప్పటికే మృతిచెందాయి. జీవనాధారమైన ఎద్దులు మృతిచెందడంతో దాదాపు రూ.1.40 లక్షల నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

పీజీఆర్ఎస్‌లో 70 ఫిర్యాదులు

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి 70 ఫిర్యాదులు అందాయి. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్‌బాబు మాట్లాడుతూ అధికంగా ఆర్థిక నేరాలకు సంబంధించిన, కుటుంబ కలహాలు, అత్తింటి వేధింపులపై ఎక్కువగా ఫిర్యాదులు అందాయన్నారు. ఆయా స్టేషన్ అధికారులకు పంపి, త్వరగా పరిష్కరించి న్యాయం చేకూరేలా చూస్తామన్నారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా ఆయా స్టేషన్ల అధికారులు జాగ్రత్త తీసుకోవాలని సూచించామన్నారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

బనగానపల్లె రూరల్: తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లాకు చెందిన దంపతులు పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన యాగంటి క్షేత్రంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపిన వివరాలు.. గద్వాల జిల్లా ఐజకు చెందిన భార్గవ్, పల్లవి దంపతులు రెండు రోజుల క్రితం యాగంటి క్షేత్రానికి వచ్చారు. కుటుంబంలో నెలకొన్న ఆర్థిక సమస్యల కారణంగా పురుగు మందు తాగారు. గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భార్గవ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బంగారు వ్యాపారులకు టోకరా

బొమ్మలసత్రం: నంద్యాలలోని 25 మంది బంగారు వ్యాపారుల నుంచి ఓ కేటుగాడు రూ.12 లక్షలకు టోకరా పెట్టిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక గాంధీచౌక్‌లో ఉన్న బంగారు వ్యాపారులకు ఒకరి తర్వాత మరొకరికి వివిధ నెంబర్ల నుంచి గుర్తుతెలియని దుండగుడు ఫోన్ చేశాడు. తాను వన్‌టౌన్ ఎస్ఐ అని చెప్పి దొంగల నుంచి బంగారు నగలు కొన్నారని తమపై కేసు నమోదు చేస్తామని బెదిరించాడు. కేసు నమోదు కాకుండా ఉండాలంటే కొంత నగదు ఫోన్‌పే ద్వారా చెల్లించాలని, ఆలస్యం చేయవద్దని బెదిరించాడు. దీంతో 25 మంది వ్యాపారులు ఒకరికి తెలియకుండా మరొకరు రూ.12 లక్షల వరకు నగదు బదిలీ చేశారు. తీరా స్టేషన్‌కు వెళ్లి పోలీసులను ఆరా తీయగా ఆ నంబర్లకు స్టేషన్‌లో ఉన్న ఎస్ఐకి ఎటువంటి సంబంధం లేదని సీఐ సుధాకర్‌రెడ్డి తేల్చి చెప్పారు. వ్యాపారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం

- ఎస్పీని ఆశ్రయించిన బాధితులు
- పీజీఆర్ఎస్‌కు 123 ఫిర్యాదులు

కర్నూలు: స్థానిక రేడియో స్టేషన్‌లో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని కర్నూలుకు చెందిన చంద్రశేఖర్, శ్రీకాంత్ రూ.18 లక్షలు తీసుకుని మోసం చేశారని మండల పరిధిలోని ఎదురూరు గ్రామానికి చెందిన శివకుమార్ ఎస్పీ బిందు మాధవ్‌కు ఫిర్యాదు చేశాడు. రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి సమస్యలను తెలుసుకుని, వినతులు స్వీకరించారు. పబ్లిక్ గ్రీవెన్స్ అడ్రెస్సల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)కు వచ్చిన 123 ఫిర్యాదులను విచారించి త్వరితగతిన న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐ శివశంకర్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- పెద్దాస్పత్రిలో ఉద్యోగం ఇప్పిస్తానని కర్నూలుకు చెందిన శివాజీ రూ.50 వేలు తీసుకుని మోసం చేశాడని నూతనపల్లె గ్రామానికి చెందిన వంశీనాథ్ ఫిర్యాదు చేశారు.
- కోట్ల రైల్వేస్టేషన్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తానని జొహరాపురానికి చెందిన శ్రీనివాసులు ఏవీఆర్ ఇన్ఫోటెక్ అనే పేరుతో ఐడీ కార్డు ఇచ్చి రూ.1.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని కల్లూరు మండలానికి చెందిన ప్రసాద్ ఫిర్యాదు చేశారు.
- కర్నూలుకు చెందిన రెహాన్ అనే వ్యక్తి న్యాయవాదిగా పరిచయం చేసుకుని బ్యాంకులోన్ ఇప్పిస్తానని, భూ సమస్యలు పరిష్కరిస్తానని రూ.1.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని ఓర్వకల్లు గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ఫిర్యాదు చేశారు.
- పంచలింగాల వద్ద ఎకరా 80 సెంట్ల పొలానికి డబ్బు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని అశోక్‌నగర్‌కు చెందిన శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు.
- ఆస్పరి మండలం కైరుప్పల గ్రామానికి చెందిన కుమ్మరి వీరభద్రి కొందరు వ్యక్తులతో కలిసి ఫోర్జరీ సంతకాలతో తనకు చెందిన ఎకరా 54 సెంట్ల పొలాన్ని ఆక్రమించుకున్నారని అదే గ్రామానికి చెందిన విజయమోహన్ ఫిర్యాదు చేశారు.



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో తమ సమస్యలు చెప్పకుంటున్న బాధితులు

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

ఆదోని సెంట్రల్: మండలంలోని సంతెకుడ్లూరు మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాసులుపై సస్పెన్షన్ వేటు వేసినట్లు మండల విద్యాధికారి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడు తాగి పాఠశాలకు వస్తున్నట్లు విద్యార్థులు, తల్లిదండ్రులు, స్టూడెంట్ సంఘాల నాయకులు చేసిన ఫిర్యాదులో నేపథ్యంలో విచారణ చేపట్టామన్నారు. వాస్తవమని తేలడంతో ఉపాధ్యాయుడు శ్రీనివాసులును సస్పెన్షన్ చేస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

క్లాట్‌లో మెరిసిన షన్ముఖప్రియ



నంద్యాల(వ్యవసాయం): క్లాట్ (కామన్ లా అడ్మిషన్ టెస్ట్) 2024 ప్రవేశ పరీక్షలో పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది కూరాకుల చంద్రమౌళి, విజయలక్ష్మి దంపతుల కుమార్తె షన్ముఖప్రియ ఆలిండియాలో 1,006 ర్యాంకు, ఆంధ్రప్రదేశ్‌లో 6వ ర్యాంకు సాధించింది. షన్ముఖప్రియ పదవ తరగతి వరకు నంద్యాల ఆర్‌జీఎం ఇంటర్నేషనల్ స్కూల్‌లో, ఇంటర్మీడియెట్ హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ జూనియర్ కాలేజీలో విద్యను అభ్యసించింది. ఆమె మాట్లాడుతూ.. డిసెంబర్ 1న ప్రవేశ పరీక్ష నిర్వహించగా సోమవారం క్లాట్ ఫలితాలు వెలువడ్డాయన్నారు. తన లక్ష్యం జడ్జిగా పోస్టును సాధించి పేద ప్రజలకు సముచిత న్యాయాన్ని అందించడానికి కృషి చేస్తానని చెప్పారు.

చిన్నకోతతో బాలునికి గుండె ఆపరేషన్



కర్నూలు(హాస్పిటల్): చిన్నకోతతో బాలునికి గుండె ఆపరేషన్‌ను విజయవంతం చేసినట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలు ఆయన వెల్లడించారు. నంద్యాల జిల్లా పాములపాడు మండలం మిట్టకందాల గ్రామానికి చెందిన ఖాజాబాషా(13)కు గుండెకు రంధ్రం ఉండటంతో కార్డియాలజీ విభాగం వైద్యులు కార్డియోథొరాసిక్ విభాగానికి రెఫర్ చేశారన్నారు. సాధారణంగా ఇలాంటి కేసులకు స్టెర్నం బోన్ కట్ చేసి ఆపరేషన్ చేస్తామని, రక్తస్రావం ఎక్కువగా ఉంటుందన్నారు. గాయం మానేందుకు సైతం సమయం ఎక్కువగా తీసుకుంటుందని తెలిపారు. 13 ఏళ్ల బాలుడు కావడంతో ఛాతి పక్కలో ఆరు సెంటీమీటర్ల కోతతో సోమవారం ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. ఈ ఆపరేషన్‌లో మత్తుమందు వైద్యుడు కొండారెడ్డి, కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ రవీంద్ర సహకారం అందించారన్నారు. ఇలాంటి ఆపరేషన్‌ను హైదరాబాద్, బెంగళూరులాంటి కార్పొరేట్ ఆసుపత్రుల్లో మాత్రమే చేస్తారని, దీనికి రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షల దాకా వసూలు చేస్తారన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఉచితంగా నిర్వహించినట్లు తెలిపారు. గుండెకు ఇలాంటి చిన్నకోత ఆపరేషన్‌ను రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కేవలం కర్నూలులోనే నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య

- వ్యాపారంలో పడి పిల్లలను సరిగా చూసుకోలేకపోతున్నానంటూ సూసైడ్ లేఖ

కర్నూలు: వ్యాపారంలో పడి పిల్లలను సరిగా చూసుకోలేకపోతున్నానంటూ సూసైడ్ లేఖ రాసి స్థానిక శ్రీరాం నగర్‌లో నివాసముంటున్న నాగ వరలక్ష్మి (34) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమె స్థానికంగా బ్యూటీ పార్లర్ నడుపుతుండగా భర్త వెంకటరమణ ఆలూరు మండలం మొలగవెల్లి పీహెచ్‌సీలో ఫార్మాసిస్ట్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. వీరికి కొడుకు, ఇద్దరు కూతుళ్ల సంతానం. పిల్లల విద్యాభ్యాసం, పోషణ విషయంలో భార్యాభర్తలు తరచూ గొడవ పడేవారు. పిల్లలను సక్రమంగా చూసుకోవడం లేదంటూ ఆదివారం భర్త నాగవరలక్ష్మిని మందలించాడు. వ్యాపారంతోనే తన సమయమంతా గడిచిపోతోందని, పిల్లలను చూసుకోవడం సాధ్యపడటం లేదంటూ ఎదురు మాట్లాడటంతో ఒకరినొకరు నిందించుకుని తీవ్రంగా గొడవ పడ్డారు. మనస్తాపానికి గురైన ఆమె సోమవారం తెల్లవారుజామున భర్త నిద్రలేచేసరికి సూసైడ్ లేఖ రాసి పక్కనపెట్టి ఉరి వేసుకుంది. వెంకటరమణ కనుగొని ఉరి నుంచి తప్పించి కిందకు దించేసరికి అప్పటికే మృతిచెందింది. విషయం తెలిసిన వెంటనే మూడవ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించగా సూసైడ్ లేఖ కనిపించింది. అందులో వ్యాపారాన్ని, పిల్లలను బ్యాలెన్స్ చేసుకోలేకపోతున్నానని, తనకు రెండు బ్యాంకు అకౌంట్లు ఉండగా ఒక అకౌంట్‌లో రూ.20 వేలు, మరో అకౌంట్‌లో రూ.30 వేలు ఉన్నాయని, వాటిని పిల్లల చదువులకు ఖర్చు పెట్టాలని, తన చావుకు ఎవరూ కారణం కాదని పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు దారితీసిన కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేషయ్య తెలిపారు.

వికసిత్ భారత్ క్విజ్ పోటీలు

కర్నూలు (హాస్పిటల్): భారత యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో మై భారత్ పోర్టల్‌లో వికసిత్ భారత్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి పి.దీప్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 29 ఏళ్ల యువత క్విజ్ పోటీలో పాల్గొనేందుకు అర్హులన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ.లక్ష, రూ.75 వేలు, రూ.50 వేలు, తదుపరి వంద స్థానాల్లో నిలిచినవారికి ఒక్కొక్కరికి రూ.2 వేలు, ఆ తర్వాత వంద స్థానాల్లో నిలిచినవారికి రూ.వెయ్యి చొప్పున నగదు పురస్కారాలు అందజేస్తారన్నారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ డిజిటల్ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇస్తారన్నారు. http://mybharat.gov.in పోర్టల్‌లో లాగిన్ అయి పోటీల్లో పాల్గొనేందుకు ఈనెల 10వ తేదీ ఆఖరి రోజు అన్నారు.

పరీక్ష కేంద్రంలోకి సెల్ ఫోన్

- మందలించినందుకు ప్రిన్సిపాల్‌పై తిరగబడిన అధ్యాపకుడు

డోన్ టౌన్: నిబంధనలకు విరుద్ధంగా పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్‌తో వచ్చిన అధ్యాపకుడు.. మందలించిన ప్రిన్సిపాల్, ఎగ్జామ్ చీఫ్ ఇన్విజిలేటర్లపైనే తిరగబడి నానా దుర్భాషలాడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. కొద్ది రోజుల నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈనెల 7న గుండా వెంకటరత్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూం ఇన్విజిలేటర్ బయటకు వెళ్లి సెల్‌ఫోన్ మాట్లాడుతుండగా ప్రిన్సిపాల్ భాకతి మందలించారు. ఎగ్జామ్ హాల్‌లో రిలీవర్‌ను పెట్టకుండా బయటకు రావడంతోపాటు సెల్‌ఫోన్ మాట్లాడటం సరికాదని వారించడంతో జీర్ణించుకోలేని ఇన్విజిలేటర్ తిరగబడి దుర్భాషలాడారు. పరీక్ష కేంద్రంలోని విద్యార్థులతోపాటు మిగతా అధ్యాపకుల ఎదుటే అరగంటకు పైగా వాగ్వాదం చేసినట్లు తెలిసింది. ఈ విషయమై సోమవారం ఇన్విజిలేటర్‌పై చీఫ్ ఎగ్జామినర్ నివేదిక తయారు చేస్తుండగా.. అక్కడకు చేరుకుని నివేదిక చించి ఆయనను కూడా పరుష పద జాలంతో తిట్టినట్లు సమాచారం. ఈ విషయమై విలేకరులు ప్రిన్సిపాల్‌ను, అబ్జర్వర్‌ను, చీఫ్ ఎగ్జామినర్‌ను వివరణ కోరగా జరిగిన విషయం వాస్తవమేనని, ఇన్విజిలేటర్‌కు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.

అమడగుంట్లలో ఉద్రిక్తత

- టీడీపీలో చిచ్చురేపిన సీసీ రోడ్ల నిర్మాణ పనులు
- సర్పంచు ఇంటి ముందు రోడ్డు వేయకుండా కోర్టు స్టే
- సీసీ డ్రైన్ నిర్మాణ పనులను అడ్డుకున్న మరో వర్గం నేతలు



అమడగుంట్లలో టీడీపీకి చెందిన ఓ వర్గం నేతలతో మాట్లాడుతున్న ఎస్ఐ, పీఆర్ ఏఈ

కోడుమూరు రూరల్: మండలంలోని అమడగుంట్ల గ్రామంలో రూ.32లక్షల ఉపాధి నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, డ్రైన్ల పనులు అధికార టీడీపీలో చిచ్చు రేపాయి. టీడీపీకి చెందిన సర్పంచు వరలక్ష్మి గ్రామంలోని 4వ వార్డులో రూ.14 లక్షలతో సీసీ రోడ్డు పనులను చేపడుతున్నారు. గతంలోనే సర్పంచు ఇంటి ముందు సీసీ రోడ్డు ఉందని, మరోసారి రోడ్డు నిర్మాణం చేపట్టరాదంటూ టీడీపీలోని మరోవర్గానికి చెందిన క్రిష్ణారెడ్డి వర్గీయులు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చారు. అయినప్పటికీ సర్పంచు వర్గీయులు సోమవారం ఇదే ప్రాంతంలో సీసీ రోడ్డు, మురుగునీటి కాల్వల నిర్మాణ పనులను చేపడుతుండడంతో క్రిష్ణారెడ్డి వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు గ్రామానికి చేరుకుని మండల ఇంజినీర్ గంగరాజు, పంచాయతీ కార్యదర్శి శంకరమ్మలతో కలిసి ఇరువర్గాలతో చర్చించారు. సర్పంచు వర్గీయులు మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టడం లేదని, కేవలం డ్రైన్ నిర్మాణం చేపడుతున్నామన్నారు. క్రిష్ణారెడ్డి వర్గీయులు మాట్లాడుతూ తాము అభివృద్ధి పనులను అడ్డుకోవడం లేదని, సర్పంచు ఇంటి వద్ద కాకుండా అవసరం ఉన్న ఎస్సీ, బీసీ కాలనీల్లో రోడ్డు వేయాలని, ఆలయం ఎదురుగా మురుగునీటి కాల్వ నిర్మాణం వద్దని కోరుతున్నామని చెప్పారు. దీంతో ఇరువర్గాలు మాట్లాడి మరోసారి గ్రామ పంచాయతీలో తీర్మానం చేసుకుని ఏకాభిప్రాయంతో పనులు చేసుకోవాలని, అంతవరకు ఎవరు కవ్వింపు చర్యలకు పాల్పడినా చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. పీఆర్ ఏఈ గంగరాజు మాట్లాడుతూ గ్రామంలోని మిగతా చోట్ల రోడ్డు పనులు యథావిధిగా జరుగుతాయన్నారు.

ఆదోని మార్కెట్ యార్డు అభివృద్ధికి నిధుల మంజూరు

కర్నూలు(అగ్రికల్చర్): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి రూ.1.38 కోట్ల నిధులు మంజూరైనట్లుగా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు నారాయణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్‌లో చిన్నపాటి వర్షం కురిసినా డ్రైనేజీ పొంగి మార్కెట్‌లో లోతట్టు ప్రాంతాల్లోను వ్యవసాయ ఉత్పత్తులను ముంచెత్తుతోంది. ఈ ఏడాది పలు సార్లు డ్రైనేజీ పొంగడం వల్ల రైతులకు భారీగా నష్టం వాటిల్లింది. ఈ దుస్థితిపై సాక్షి పలు కథనాలను ప్రచురించింది. వీటికి స్పందించిన జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఇటీవల మార్కెట్ యార్డులో పర్యటించి డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. అవసరమైన నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఈ మేరకు మార్కెటింగ్ శాఖ ప్రతిపాదనలు పంపింది. ఇందులో భాగంగా అదనపు డ్రైనేజీ సౌకర్యం కల్పించేందుకు రూ.70 లక్షలు, డ్రైన్ కట్టర్, వరండా పైకప్పు అభివృద్ధికి రూ.28.50 లక్షలు, బోర్‌వెల్, పైపులైన్ ఆర్‌వోఆర్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.15 లక్షలు, రెండు టాయ్‌లెట్స్ బ్లాక్‌లు నిర్మించేందుకు రూ.25 లక్షలు మంజూరైనట్లు ఏడీ పేర్కొన్నారు.